నకిలీ మద్యంతో ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం

- నకిలీ మద్యం తయారీదారులను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టాప్రతుల్
- నకిలీ మద్యంపై కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- భారీ ర్యాలీ, సోమప్ప సర్కిల్, ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన


పట్టణంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: నకిలీ మద్యం తయారీ దారులకు ప్రోత్సహిస్తూ ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టాప్రతుల్ ఆరోపించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, కేఆర్ మురహరిరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా సోమప్ప సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ పార్టీ మహిళా నాయకురాళ్లు బైఠాయించి మద్యం బాటిళ్లతో నిరసన తెలిపారు. అక్కడి నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని, స్టేషన్ ఎదుట బైఠాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల ములకల చెరువు వద్ద పట్టుబడిన నకిలీ మద్యం ఫ్యాక్టరీని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులను కూటమి ప్రభుత్వం వెనుకేసుకొస్తుందన్నారు. ఏకంగా నకిలీ మద్యం ఫ్యాక్టరీ నిర్వహిస్తూ బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నా ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఆధారాలతో సహా అధికారులు పట్టుకున్నా నిందితులను రక్షించేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మద్యం మాఫియా రాజ్యమేలుతున్నా కూటమి ప్రభుత్వం కళ్లు మూసుకోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు.

టీడీపీ నాయకులకే మద్యం షాపులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహిస్తూ కోట్లాది రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వాని సమకూర్చితే.. అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం టీడీపీ నాయకులకు ఆయా షాపులను కట్టబెట్టి నకిలీ మద్యం వ్యాపారానికి తెరలేపిందని విమర్శించారు. నకిలీ మద్యంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని, అయినా ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. లిక్కర్ వ్యాపారికి టీడీపీ పెద్దలతో సంబంధాలున్నా తమకేమి తెలియదనడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని గుర్తించాలని, నకిలీ మద్యం పట్ల జాగ్రతగా వుండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకురాళ్లు లతారెడ్డి, అరుణమ్మ, సుమిత్రమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంపీపీ కేశన్న, పార్టీ నాయకులు భీమిరెడ్డి, రియాజ్ అహమ్మద్, సునీల్‌కుమార్, యూకే రాజశేఖర్, కోటకొండ నరసింహులు, బోయబజారి, శివప్రసాద్, కోటేకల్ లక్ష్మన్న, గడ్డం లక్ష్మినారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మన్సూర్ అహమ్మద్, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, షాబుద్దీన్, రామకోటిరెడ్డి, పాలశ్రీనివాసరెడ్డి, కాశీవిశ్వనాథ్ రెడ్డి, ముల్లా రసూల్, అల్తాఫ్, మల్లికార్జున రెడ్డి, మధుబాబు, చేనేత మల్లికార్జున, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎర్రకోట జగన్, బుట్టా ప్రతుల్, పార్టీ నాయకులు


సోమప్ప సర్కిల్‌లో మద్యం బాటిళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, పార్టీ శ్రేణులు

కల్తీ మద్యం, బెల్టుషాపులను అరికట్టడంలో విఫలం

ఆదోని టౌన్: కల్తీ మద్యం, బెల్టుషాపులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, ఆదోని పట్టణాధ్యక్షులు బి.దేవా అన్నారు. ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఎక్సైజ్ సీఐ సైదుల్‌కు వినతి పత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, ఆదోని పట్టణాధ్యక్షుడు బి.దేవా మాట్లాడుతూ.. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని అబద్ధాలు చెప్పి.. నేడు సీఎం చంద్రబాబునాయుడు కల్తీ మద్యంతో రాష్ట్రంలో పేదల మరణాలకు కారణమవుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో తమ కార్యకర్తలకు బెల్టుషాపులు ఇస్తున్నారన్నారు.

ధనార్జనే లక్ష్యంగా..

ధనార్జనే లక్ష్యంగా చేసుకుని కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తెస్తే, నేడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేస్తూ ప్రజలను అన్నివిధాలా కష్టాలకు గురి చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి ఎదురు నిలిచి పోరాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కల్తీ మద్యం, బెల్టుషాపులను అరికట్టకపోతే పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి, నాయకులు ఫయాజ్, ఏసోబు, సునర్‌ఖాదర్, హామద్‌బాషా, దినేష్, లక్ష్మన్న, దేవదాస్, హనుమేష్, నాగరాజ్, సిద్ధ, దానం రామకృష్ణ, రాయుడు, హాజీబాషా, వీరాంజి, శాంత, పరిగెల నారాయణ, మల్లి, రాజేశ్వరరావు, వేణు, చలపతి, బాసు, కిరణ్, ఉదయ్, చిన్న తారానాథ్, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ సీఐ సైదుల్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రజల ప్రాణాలు కాపాడండి

కోసిగి: కల్తీ మద్యం అరికట్టి ప్రజల ప్రాణాలకు కాపాడాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాలతో కోసిగిలో వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో కల్తీ మద్యంపై శాంతి యుతంగా ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేసి, ఇందుకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలన్నారు. నకిలీ మద్యం తాగి చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించి అనర్హులను తొలగించాలన్నారు. మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మంగమ్మ, షంషుద్దీన్, జగదీష్ స్వామి, గానిగ వీరస్వామి, బుళ్లి నరసింహులు, ప్రతాప్, నాడుగేని వీరారెడ్డి, తాయన్న, బండ్ల గోవిందు, కాంట్రాక్టర్ నాగరాజు, కొరివి నాగరాజు, రహీమ్, రాము, గూటెన్న, బసిరెడ్డి, దొడ్డి నరసన్న, నరసింహులుగౌడ, కాల్వ లక్ష్మయ్య, నేలకోసిగి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


కోసిగిలో ర్యాలీ చేపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలి

నందవరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కు నాణ్యమైన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని యూ టీఎఫ్ నాయకులు దావీదు, ఎల్లప్ప, దేవపాల్ పిలుపు నిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ ఆవరణలో నూతనంగా విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయులతో యూటీఎఫ్ నాయకులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ.. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యా య వృత్తి గౌరవప్రదమైనదన్నారు. ఎంతో శ్రమపడి కఠినమైన పోటీని ఎదుర్కొని ఉద్యోగం పొందారని, విధుల పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్రాముడు, భాగ్యరాజు, జయరాజు, పరమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు, విజయేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సుధకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు,సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనం రూ.18,600లు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.

క్లుప్తంగా

సర్వీస్ రిజిస్టర్ల పంపిణీ


పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారులు

ఆదోని సెంట్రల్: నూతనంగా బాధ్యతలు చేపడుతున్న 129 మంది ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్టర్లు, ఫారమ్స్‌ను మండల విద్యాధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులుచేతులు మీదుగా పంపిణీ చేశారు. మండల వనరుల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాల పవిత్రమైనదన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసినప్పుడే మనకు మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, మహాదేవప్ప, వీరచంద్ర యాదవ్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఎమ్మిగనూరుటౌన్: గత విద్యాసంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 90శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వీరశైవ లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో అందించనున్నట్లు సంఘ నాయకులు న్యాయవాది మల్లికార్జున సోమవారం తెలిపారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన వీరశైవ లింగాయత్ విద్యార్థులు ఆధార్‌కార్డ్, మార్కులలిస్ట్ జిరాక్స్ ప్రతులకు ఒక ఫొటో జతపరిచి ఈనెల 31వ తేదీలోగా ఇవ్వాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 94402 93342, 98488 92777, 98854 90992లను సంప్రదించాలని కోరారు.

వామపక్షాల ఆధ్వర్యంలో 'మోదీ గోబ్యాక్'

ఎమ్మిగనూరుటౌన్: సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో గోబ్యాక్ మోదీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వామపక్షాల నాయకులు పంపణ్ణ గౌడ్, గోవిందు, రంగన్న, రాజు తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రధాని గోబ్యాక్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేని ప్రధాని జీఎస్టీ తగ్గించానని చెప్పుకోవడం కోసం ఇక్కడికి రావడం హాస్యాస్పదంగా వుందన్నారు. 2017లో జీఎస్టీ విధించినప్పుడే వామపక్షాలు వ్యతిరేకించాయన్నారు. జీఎస్టీ విధించిన ఏ దేశం కూడా అభివృద్ధి చెందిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మద్దిలేటినాయుడు, రాజీవ్, అబ్దుల్లా, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వై ప్రదీప్ రెడ్డి

పెద్దకడబూరు : వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు నరసయ్య (55) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రదీప్ రెడ్డి రంగాపురం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎళ్ల వేళ ఎమ్మెల్యే వై . బాలనాగిరెడ్డి కుటుంబ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

వినూత్న నిరసన


తిరుమల నగర్‌వాసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని తిరుమల నగర్ వాసులు తమ సమస్యలపై ఫ్లెక్సీ విన్నూతంగా నిరసన తెలిపారు. నాయకులు, అధికారులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని, తమ మొర ఆలకించండి అని పేర్కొంటూ ప్రధాన రహదారి పక్కన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 'కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నాం.. అయితే కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఏటా వేలకు వేలు ఇంటి పన్నులు మున్సిపాలిటీకి చెల్లిస్తున్నాం. కాని అభివృద్ధికి మాత్రం తమ కాలనీ నోచుకోవడం లేదని, దయవుంచి తమ సమస్యలను పరిష్కరించాలని.. ఫ్లెక్సీపై రాయించారు.

ఈరన్న స్వామికి పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఆదోని సెంట్రల్/రూరల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ డిల్లీశ్వరి అన్నారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదువుతూ అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం బాలికలకు ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, సావిత్రి, రాగిణి వసంత, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు భవిష్యత్తుకు వెలుగు

మంత్రాలయం రూరల్ : బాలిక చదువు భవిష్యత్‌కు వెలుగునిస్తుందని సీడీపీఓ రాజేశ్వరిదేవి అన్నారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న చేస్తున్న సీడీపీఓ డిల్లీశ్వరి

సోమవారం మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటి బచావో - బేటి పఢావో కార్యక్రమంలో నిర్వహించారు. విద్యార్థినులతో జెడ్పీ పాఠశాల నుంచి సీడీపీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి మానవ హారం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు భీమేశ్వరమ్మ, శ్వేత పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారు

ఆదోని రూరల్: సమాచార హక్కు చట్టాన్ని స్థానిక అధికారులు నీరు గారుస్తున్నారని, సరైన సమాచారాన్ని అందించడం లేదని ముందడుగు సంస్థ జిల్లా అధ్యక్షులు దేశాయ్ చంద్రన్న ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చి 20 ఏళ్లు పూర్తి అయినా అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తులకు సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. సాక్షాత్తు ఐఏఎస్ అధికారి ఉన్న ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కూడా కొన్ని అవినీతికి సంబంధించిన దరఖాస్తులకు సమాచారం రావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్, చంద్రకుమార్, కౌతాళం విజయ్‌కుమార్, గొల్ల క్రిష్టన్న, శ్రీకాంత్, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నందవరం : మండల కేంద్రం నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఫుట్‌బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామకృష్ణరాజు తెలిపారు. సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. అండర్-19 ఫుట్‌బాల్ విభాగంలో జ్యోతి, అండర్-17 విభాగంలో జిలాన్ బాషా, పల్లవి, వాణి, అండర్-14 విభాగంలో హుస్సేన్ బాషా, మౌనిక, కాశీమమ్మ ఉత్తమ ప్రతిభ చాటన్నారు. ఎంపికైన విద్యార్థులతో పాటు వ్యాయమ ఉపాధ్యాయులు జె. ఉమాపతి, అబ్దుల్‌లతీఫ్‌లను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బసవరాజు, శేఖరప్ప, ఉమాదేవి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


నందవరంలో రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శివారు కాలనీల్లో అభివృద్ధి శూన్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివారు కాలనీలో అభివృద్ధి శూన్యమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఆరోపించారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ స్పెషల్‌గ్రేడ్‌కు స్థాయి పెరిగినా మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. పట్టణంలోని మైనారిటీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, శివన్న నగర్, చంద్రయ్య కొట్టాల, మిలటరీ కాలనీ, సాయినగర్, తిరుమల నగర్, జోగి కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు లేవన్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మంచినీటి వసతి, వీధి దీపాలు లేక ఆయా ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున గౌడ్, తిమ్మగురుడు, వీరేష్, విజయేంద్ర, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



వైద్యులకు మద్దతుగా ఆస్పత్రి ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డాక్టర్ శ్రీదేవి, సీహెచ్ఓ మేరిగోల్డ్, ఎంపీహెచ్ఈఓలు హనుమంతు, సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులకు మద్దతుగా సీహెచ్ఓ, ఎంపీహెచ్ఈఓలు, ఎంపీహెచ్ఎస్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వైద్యులకు పదోన్నతులు కల్పించడం లేదన్నారు. జీఓ 99 ద్వారా ఇన్ సర్వీస్ పీజీ కోటా కేవలం 15శాతానికి తగ్గించి, ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, పీహెచ్ఎన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాదోపిడీని అరికట్టాలి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యాదోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. సోమవారం ఎంఆర్సీ భవనం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు పాఠశాలలు జీఓ నంబర్-1ను అమలు చేయకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సాయంత్రం 6.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. పట్టణంలో పాఠశాలకు అనుమతులు లేక పోయినా నడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శేఖర్, మోహన్, తిరుమల, చరణ్, అబ్బూ, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కన్వీనర్లుగా ఎంపిక

ఆదోని సెంట్రల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కర్నూలు విభాగ్ అభ్యాస వర్గలో కన్వీనర్లుగా ఆదోనికి చెందిన ఎం.కే మహేష్, రాహుల్, హనుమేష్ ఎంపికయ్యారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 11, 12వ తేదీలో ఎమ్మిగనూరులో జరిగిన సమావేశంలో ఆదోని బాగ్ కన్వీనర్‌గా ఎం.కే మహేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా రాహుల్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్‌గా హనుమేష్‌లను నియమించారన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించి, వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

ర్యాలీకి మద్దతు

ఆదోని రూరల్: ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటనకు వ్యతిరేకంగా ఈనెల 15న జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టే ర్యాలీకి మద్దతు తెలుపుతున్నట్లు డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధణాపురం ఉదయ్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీఎస్టీలు 50 శాతం వరకు విధించి ఇప్పుడు 10 శాతం తగ్గించి కపట ప్రేమను చూపిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తానని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, 16 నెలల కాలంలో నాలుగుసార్లు మోదీ రాష్ట్రానికి వచ్చారని, ఒక్కసారైనా ప్రజలకు మేలు చేసే పని చేశారా అని ప్రశ్నించారు. రాయలసీమ డిక్లరేషన్ పేరుతో బీజేపీ ప్రకటించిన హామీలలో ఒక్కటీ అమలు చేయకుండా ఈ ప్రాంత ప్రజలను దగా చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా విభజన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు అరుణ్, నవీన్, సుకుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు


కోసిగిలో ఎంఈఓ బాలయ్యకు జాయినింగ్ ఆర్డర్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

కౌతాళం: మండలానికి ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. మండలానికి 253 మంది ఉపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈఓ-1 రామాంజినేయులు, ఎంఈఓ-2 శోభరాణి తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు 129 మంది ఉపాధ్యాయులు వచ్చారని ఇందులో కన్నడ ఉపాధ్యాయులు ఆరుగుగు, 123 మంది తెలుగు మీడియం ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. జెడ్పీ పాఠశాలలకు మొత్తం 124 మంది ఉపాధ్యాయులు వచ్చినట్లు తెలిపారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరి నియమక పత్రాలను ఎంఈఓ కార్యాలయంలో అందిజేసినట్లు వివరించారు.

కోసిగి మండలంలో 255 ఉపాధ్యాయులు

కోసిగి: మండలంలో 255 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించినట్లు ఎంఈఓ బాలయ్య తెలిపారు. సోమవారం కొత్తగా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి జాయిన్ అయ్యారు. మధ్యాహ్నం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగం చేరిన వారిలో ఎస్జీటీ తెలుగు 156, ఎస్జీటీ ఉర్దూ 2, స్కూల్ అసిస్టెంట్స్-97 మంది చేరినట్లు తెలిపారు. సీఆర్పీలు ఉసేని, యోహాన్, ఎంఐసీ కోఆర్డినేటర్ వీరారెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 79 మంది ఉపాధ్యాయులు

గోనెగండ్ల : మండలానికి ఆయా పాఠశాలలకు నూతనంగా 79మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో నూతన ఉపాధ్యాయులు ఎంఈఓల సమక్షంలో జాయిన్ అయ్యారు.

కొత్త సార్లొచ్చారు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పలు మండల పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు 2025 డీఎస్సీలో ఎంపికై న కొత్త ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఎమ్మిగనూరు మండలానికి వచ్చిన 17 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్‌లు, ఒక ఉర్దూ ఉపాధ్యాయుడు ఎంఈఓ ఆంజినేయులుకు జాయినింగ్ పత్రాలు అందజేశారు. అదేవిధంగా గోనెగండ్ల మండలంలో 61మంది ఎస్‌జీటీలు, 18మంది స్కూల్ అసిస్టెంట్‌లు, నందవరం మండలంలో 9 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, 47 మంది ఎస్‌జీటీలు, నలుగురు ఉర్దూ ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

మంత్రాలయం రూరల్ : నూతన ఉపాధ్యాయులు విధులను అంకితభావంతో నిర్వహించి మంచి గుర్తుంపు పొందాలని ఎంఈఓ-2 రాఘన్న సూచించారు. సోమవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో నూతన ఉపాధ్యాయులు ఎంఈఓ-2కు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 121 నూతన ఉపాధ్యాయులు జాయిన్ అయ్యాయని చెప్పారు. అందులో వగరూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఏడుగురు ఉపాధ్యాయులను కేటాయించారని వివరించారు.

ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

నందవరం : ఈ నెల 16వ తేదీన దేశ ప్రధాన మంత్రి మోదీ కర్నూలు పర్యటనను అందరూ కలిసికట్టుగా పని చేసి విజయవంతం చేద్దామని ఎంపీడీఓ పుల్లయ్య పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయ శాఖ సిబ్బందితో ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..మోదీ పర్యాటనలో భాగంగా నందవరం మండలానికి 80 బస్సులు కేటాయిస్తున్నారని,. అందులో 60 బస్సులు డీఆర్‌డీఏకు, 20 బస్సులు ఉపాధి కూలీలకు కేటయిస్తున్నారని వివరించారు. పర్యవేక్షణలో ఆయా శాఖల సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరిత, ఏపీఎం రాఘవేంద్ర, ఏపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, 13 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిప్యూటీ తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణకార్మికుల సంక్షేమ బోర్డ్‌కు నిధులు కేటాయించి వారి సంక్షేమానికే ఖర్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. సోమవారం నేషనల్ పాఠశాలలో ఏపీటీజీ నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్‌తో పాటు పెండింగ్ బకాయిలను అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నెలలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడంలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 4 డీఏలు, పీఆర్సీ బకాయిలు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన గ్రాట్యూటీ, సరెండర్ లీవ్‌లకు సంబంధించి నగదును 15 నెలలు గడిచినా ఇవ్వకపోవడం విచారకమన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నప్ప, చంద్రశేఖర్, కేశవయ్య, జయరాం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

గోనెగండ్ల : జీఎస్టీ తగ్గింపుతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ మణి మంజరి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జీఎస్టీలో మార్పులతో ధరల్లోని తగ్గుదలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.